క్లుప్తంగా

చదువుతోనే గుర్తింపు

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి


బస్‌పాస్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యే

పరిగి: విద్యార్థులు కష్టపడి చదివి నియోజకవర్గానికి పేరు ప్రఖ్యాతులు తేవాలని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి ఆకాంక్షించారు. నియోజకవర్గంలోని 8వేల మంది విద్యార్థులకు ఎమ్మెల్యే తన సొంత ఖర్చులతో ఉచిత బస్‌పాస్‌లను శుక్రవారం అందజేసి మాట్లాడారు. చిన్నతనం నుంచే కష్టపడి చదివే తత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. చదువుతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని, విద్యాభివృద్ధికి తాను ఎల్లప్పుడూ కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎంతగానో పాటుపడుతుందని పేర్కొన్నారు. ఇందులో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, నాయకులు ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత


పిచ్చిమొక్కల తొలగింపును పర్యవేక్షిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్

వికారాబాద్ అర్బన్: పట్టణ ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా వెంటనే స్పందించి, వారి సమస్యను పరిష్కరించే దిశగా కృషి చేస్తామని వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల అన్నారు. పుర పరిధి ఆలంపల్లి నుంచి గెరిగేట్ పల్లి వెళ్లే దారిలో రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరిగి, మూలమలుపుల వద్ద ప్రమాదాలకు నిలయంగా మారాయని పలువురు చైర్పర్సన్ దృష్టికి తీసుకు వచ్చారు. దీంతో స్పందించిన ఆమె శుక్రవారం మున్సిపల్ సిబ్బంది, జేసీపీ సహాయంతో పిచ్చి మొక్కలను తొలగింప జేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ రమేష్ కుమార్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాం చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

బొంరాస్‌పేట: మండల పరిధిలోని మదన్‌పల్లి, దుప్‌చర్ల, బురాన్‌పూర్, పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ వెంకటేశ్ పరిశీలించారు. బూతుల వారీగా సౌకర్యాలు, వసతులు పరిశీలించి నివేదికలు తయారుచేశామని ఆయన వెల్లడించారు. ఇందులో రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పరామర్శ

బొంరాస్‌పేట: రేగడిమైలారంలో పొలం పనులు చేస్తూ కోటగారి పెద్ద మల్లప్ప గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నేత ఎనుముల తిరుపతిరెడ్డి శుక్రవారం మల్లప్ప కుటుంబీకులను పరామర్శించారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు గుండప్ప, నాయకులు చంద్రప్ప, పరమేశ్వర్, శ్రీశైలం, శ్రీనివాస్ ఉన్నారు.

దరఖాస్తుల పరిశీలన

తాండూరు రూరల్: గృహలక్ష్మి పథకానికి వచ్చిన దరఖాస్తులను అధికారులు బృందాలు ఏర్పడి పరిశీలిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ఏపీఎం ఆనంద్ బృందం మల్కాపూర్‌లో పర్యటించింది. స్థానిక సర్పంచ్ విజయలక్ష్మితో కలిసి గ్రామంలో ఇంటింటికీ తిరిగి వివరాలు నమోదు చేసుకున్నారు. ఆహార భద్రత కార్డు, ఇంటి స్థలంపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అబ్దుల్ మజీద్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న బీఆర్ఎస్

మర్పల్లి: ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో గద్దె దించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవిందర్ పిలుపునిచ్చారు. శుక్రవారం యువజన పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎన్. నిఖిల్‌రెడ్డి.. పార్టీ మండల యువజన అధ్యక్షుడు సాయికుమార్ ఆధ్వర్యంలో జోడోయాత్ర వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి ఇంటింటికీ పంచిపెట్టారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం వచ్చిన తరువాత గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వరంగల్ రైతు డిక్లరేషన్, హైదరాబాద్ యువ, ఖమ్మం పింఛన్ డిక్లరేషన్ విధివిధానాలను వివరిస్తూ గ్రామంలో ర్యాలీ తీశారు. పార్టీ జిల్లా కార్యదర్శి ప్రభాకర్ ఉన్నారు.


శ్రావణమాసం సందర్భంగా శుక్రవారం వికారాబాద్ పట్టణంలోని శ్రీ బుగ్గ రామేశ్వర ఆలయంలో భక్తులకు అన్నదానం చేస్తున్న వీరశైవ సమాజం ప్రతినిధులు.
– అనంతగిరి

‘గృహలక్ష్మి’ కటాక్షం ఎవరికో?

- ఊపందుకున్న దరఖాస్తుల పరిశీలన
- అర్హులను ఎంపిక చేయాలని అర్జీదారుల వినతి
- నచ్చిన వారి పేర్లకు ప్రజాప్రతినిధుల మొగ్గు!
- ప్రతిపక్ష నాయకుల ఆరోపణ


అంతారంలో సర్వే చేస్తున్న అధికారులు

దౌల్తాబాద్: పేదవాడి సొంతింటి కలను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం గృహలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టింది. సొంత నివాస స్థలం ఉండి, ఇళ్లు లేని వారిని అర్హులుగా ప్రకటించింది. సొంత జాగలో పక్కా ఇల్లు నిర్మించుకోవడానికి రూ.3లక్షల చొప్పున నియోజకవర్గానికి 3వేల మందికి రుణం ఇవ్వాలని నిర్ణయించింది. అందులో భాగంగానే నిజమైన అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. దీంతో గడువులోగా అనుకున్నదానికంటే అధికంగా దరఖాస్తులు వచ్చి చేరగా.. ‘గృహలక్ష్మి’ కటాక్షం ఎంతమందిని వరిస్తుందో వేచి చూడాలి. తొలివిడతలో ఈ నెల 10వ తేదీ వరకు ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించింది. మండలంలో అధిక సంఖ్యలో 7,553 మంది అర్జీ పెట్టుకున్నారు. ఈ నెల 25లోపు వాటి పరిశీలన ప్రక్రియను పూర్తి చేసేందుకు అధికారులు విస్తృత స్థాయిలో గ్రామాల్లో పర్యటిస్తున్నారు.

నచ్చిన వారి పేర్లతో జాబితా!

ఒక పక్క సంబంధిత అధికారులు దరఖాస్తులు పరిశీలిస్తుండగానే.. మరో పక్క నియోజకవర్గ ప్రజాప్రతినిధులు తమకు నచ్చిన వారి పేర్లతో జాబితాను సిద్ధం చేస్తున్నట్లు ప్రతిపక్ష నాయకులు, ప్రజల నుంచి ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికే రెండు పడక గదులు లేక తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, తమకు న్యాయం చేయాలని అర్హులు వేడుకుంటున్నారు. గ్రామాల్లో చాలా మందికి ఇళ్లు లేక పూరి గుడిసెల్లో నివాసం ఉంటున్నారని, వాటిని పరిశీలించి నిజమైన అర్హులను ఎంపిక చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నోడల్ అధికారిగా కలెక్టర్

గృహలక్ష్మి పథకానికి కలెక్టర్లు నోడల్ అధికారులుగా వ్యవహరిస్తున్నారు. దరఖాస్తుల ఆధారంగా అర్హులను ఎంపిక చేయడానికి గ్రామాల వారీగా పరిశీలన చేస్తున్నారు. మండల పరిధిలో ఎంపీడీఓ, ఎంపీఓల ఆధ్వర్యంలో పరిశీలన జరుగుతోంది. సొంత స్థలం ఉందా? బీపీఎల్ పరిధిలో ఉన్నారా.. లేదా? గ్రామంలోని ఓటుహక్కు ఉన్నట్లు గుర్తింపు కార్డు ఉందా? ప్రస్తుతం ఉంటున్న ఇల్లు ఎవరిది? తదితర వాటిని పరిగణలోకి తీసుకుంటున్నారు. తుది జాబితాను సిద్ధం చేసి కలెక్టర్‌కు నివేదిస్తారు. ఎంపికలో అన్ని వర్గాల వారు ఉండేలా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం.

మధ్యవర్తులను ఆశ్రయించరాదు

కుల్కచర్ల: నిజమైన లబ్ధిదారులకు గృహలక్ష్మి పథకం అందేలా దరఖాస్తుల పరిశీలన కొనసాగుతుందని తహసీల్దార్ మురళీధర్ అన్నారు. మండల కేంద్రంలోని పలు కాలనీల్లో ఆయన పర్యటించి దరఖాస్తు దారుల ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం సూచించిన నియమనిబంధనలు, సూచనల మేరకు అర్జీలను పరిశీలించి, జిల్లా అధికారులకు నివేదిస్తామని పేర్కొన్నారు. పథకం పొందేందుకు ఎవరూ మధ్యవర్తులను ఆశ్రయించరాదని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిజమైన అర్హులకే సహాయం


కందనెల్లిలో అర్జీలను పరిశీలిస్తున్న ఆర్ఐ రాజిరెడ్డి

పెద్దేముల్: పెద్దేముల్ మండలం కందనెల్లిలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) రాజిరెడ్డి.. సర్పంచ్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో గృహలక్ష్మి దరఖాస్తులను పరిశీలించారు. గ్రామంలో మొత్తం 210 అర్జీలు రాగా.. అర్జీ దారుల ఇంటికి వెళ్లి, సొంత నివాస స్థలం, ప్రస్తుతం నివాసం ఉంటున్న ఇంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిజమైన అర్హుల సొంతింటి నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.3లక్షలు ఆర్థిక సహాయం అందజేస్తుందని పేర్కొన్నారు. వారితో పాటు గ్రామ పెద్దలు శ్రీనివాస్ చారీ, పంచాయతీ కార్యదర్శులు రమేష్, మల్లికార్జున తదితరులు ఉన్నారు.

నిబంధనలు తప్పనిసరి


చక్రంపల్లిలో దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శైలజారెడ్డి

మోమిన్‌పేట: గృహలక్ష్మి పథకానికి ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరని ఎంపీడీఓ శైలజారెడ్డి చెప్పారు. శుక్రవారం మోమిన్‌పేట మండలం చక్రంపల్లిలో దరఖాస్తులు పరిశీలించి మాట్లాడారు. అర్జీదారులు నిబంధనలను పాటించాలని, తప్పని సరిగా సొంత నివాస స్థలం ఉండాలని, శిథిలా వస్థకు చేరిన ఇల్లు అయినా ఉండి, ఆహార భద్రత కార్డు కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఇంటింటికీ తిరిగి అర్జీలను పరిశీలించేందుకు ఆరుగురు ప్రత్యేక అధికారులు పనిచేస్తున్నారని త్వరలో పూర్తి చేస్తామని ఆమె వెల్లడించారు. ఆమె వెంట కార్యదర్శి విక్రంరెడ్డి తదితరులు ఉన్నారు.

సంక్షేమానికి ఆకర్షితులై పార్టీలో చేరిక

ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

బొంరాస్‌పేట: అధికార పార్టీ బీఆర్ఎస్‌లోకి వలసలు పెరుగుతున్నాయి. శుక్రవారం మండల కేంద్రంలోని మైనార్టీలు పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సమక్షంలో చేరగా.. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించి మాట్లాడారు. పార్టీ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో పలువురు చేరుతున్నారని ఆయన పేర్కొన్నారు. మైనార్టీల కోసం కేసీఆర్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని చెప్పారు. పార్టీలో చేరిన వారిలో మహ్మద్ అన్వర్, వసీముద్దీన్, మక్బూల్‌తో పాటు 18మంది ఉన్నారు. ఇందులో వైస్‌ఎంపీపీ శ్రావణ్‌కుమార్‌గౌడ్ ఉన్నారు.

ఉద్యోగుల సహకారంతోనే అభివృద్ధి

మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి


కార్మికులకు కిట్లు అందజేస్తున్న చైర్మన్

కొడంగల్: ఉద్యోగుల సహకారంతోనే మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పంద్రాగస్టు వేడుకల్లో ఉత్తమ అవార్డులు అందుకున్న పుర కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, శానిటేషన్ సూపర్‌వైజర్ సలాఉద్దీన్‌ను చైర్మన్ సన్మానించి మాట్లాడారు. అన్ని విభాగాల సిబ్బంది సహకారంతోనే ప్రజాసమస్యలకు ఎప్పటికప్పుడు పరిష్కారం చూపుతున్నామని పేర్కొన్నారు. అనంతరం శానిటేషన్ సిబ్బందికి సబ్బులు, కొబ్బరి నూనె డబ్బాలు, దుప్పట్లు తదితర సామగ్రిని ఉచితంగా అందజేశారు.

క్రమబద్ధీకరించాలి

సమస్యలు పరిష్కరించాలంటూ మెప్మా ఆర్పీలు, మున్సిపల్ కాంట్రాక్టు సిబ్బంది మున్సిపల్ చైర్మన్, కమిషనర్‌కు వినతిపత్రాలు అందజేశారు. పర్మినెంట్ చేసి, కనీస వేతనం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి, కౌన్సిలర్లు వెంకట్‌రెడ్డి, రమేష్, సుజాత, కోఆప్షన్ సభ్యులు మునీర్, పకీరప్ప, సామాజిక కార్యకర్త మురహరి వశిష్ట తదితరులు పాల్గొన్నారు.

“ పన్నులు చెల్లించండి



ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి, అభివృద్ధికి సహకరించాలి. కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలో నిధుల కొరత ఉంది. పరిపాలన సవ్యంగా సాగించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలంటే నిధులు అవసరం అవుతాయి. వాటిని ప్రజలు పన్నుల రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. బకాయిదారులు వెంటనే పన్నులు చెల్లించి అభివృద్ధికి తోడ్పడండి.
– ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కమిషనర్

బడి ఆవరణలో సీసీబెడ్


పాఠశాల ఆవరణలో సీసీబెడ్ నిర్మాణం

బొంరాస్‌పేట: గ్రామపంచాయతీ నిధులతో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం సీసీబెడ్ నిర్మాణం పనులు చేపట్టారు. బడి భవనం ప్రార్థన స్థలంలో విద్యార్థులకు వివిధ కార్యక్రమాలకు ఇబ్బందిగా ఉన్న నేపథ్యంలో ఎస్ఎంసీ విన్నపం మేరకు సీసీబెడ్ నిర్మించడంతో హెచ్‌ఎం పాపిరెడ్డి హర్షం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ శ్రావణ్, మండల కోఆప్షన్ సభ్యుడు మొయిన్, సర్పంచు జయమ్మ, ఉపసర్పంచ్ అంజయ్య, ఎస్ఎంసీ చైర్మన్ యాదగిరి, లచ్చప్ప, పంచాయతీ కార్యదర్శి వెంకటయ్య, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వెంకటేశంగౌడ్ తదితరులు

బంట్వారం: అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు మంజూరు చేయాలని బీజేపీ గీతాసెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశం గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం పార్టీ నాయకులతో కలిసి తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. గృహలక్ష్మి పథకం కింద అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన ఎన్నికల హామీలు దళిత బంధు, బీసీబంధు, మైనార్టీబంధు పథకాల కింద అర్హులకు ఆర్థిక సహాయం అందజేయాలని పేర్కొన్నారు. నిరుద్యోగ భృతి, దళితులకు ఇస్తామన్న మూడెకరాల చొప్పున వ్యవసాయ భూమిని వెంటనే అమలు చేయాలన్నారు. లేని యెడలా పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సెకండ్ ఏఎన్ఎంలను విస్మరించిన ప్రభుత్వం

- 20 ఏళ్లుగా పనిచేస్తున్న వారిని కాదని కొత్త నోటిఫికేషనా?
- కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను తొలుత క్రమబద్ధీకరించాలి
- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్య డిమాండ్


వికారాబాద్: ఎన్టీఆర్ చౌరస్తాలో ఏఎన్ఎంల మానవహారం

కొడంగల్ రూరల్: రెండు దశాబ్దాలుగా ప్రజారోగ్యం పరితపిస్తున్న సెకండ్ ఏఎన్ఎంలను విస్మరించి, ప్రభుత్వం కొత్తగా నియామకాలు చేపట్టకోసం నోటిఫికేషన్ వేయడం విడ్డూరంగా ఉందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య అన్నారు. సమస్యల సాధన కోసం ఏఎన్ఎంలు శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఏఎన్ఎంలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. సమస్యల సాధన కోసం నాలుగు రోజులుగా ఏఎన్ఎంలు నిరవధిక సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. 1,520 పోస్టులకు సంబంధించి వేసిన నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేయాలన్నారు. రాష్ట్రంలో 5,160మంది సెకండ్ ఏఎన్ఎంలు 20ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నారని, ఇందులో కొందరి వయస్సు పైబడి పోతున్న క్రమంలో ప్రభుత్వం స్పందించి వారిని క్రమబద్ధీకరించాలని కోరారు. ఇందులో ఏఎన్ఎంల సంఘం జిల్లా అధ్యక్షురాలు లీలావతి, సభ్యులు రాములమ్మ, అనిత, కవిత, అనంతలక్ష్మి, అనురాధ, శ్రీలత, పుష్పలత, మంజుళ, సంగీత ఉన్నారు.

కాంట్రాక్ట్ విధానం రద్దు చేయాలి


కొడంగల్ రూరల్: అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తంచేస్తున్న సెకండ్ ఏఎన్ఎంలు

అనంతగిరి: కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేసి, సెకండ్ ఏఎన్ఎంలను పర్మినెంట్ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం డిమాండ్ చేశారు. వికారాబాద్ పట్టణం ఎన్టీఆర్ చౌరస్తాలో ఏఎన్ఎంలు మానవహారం నిర్వహించగా.. వారికి సంఘీభావం తెలుపుతూ ఆయన మాట్లాడారు. వైద్య శాఖలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఏఎన్ఎం లను వెంటనే ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. ఇందులో సీఐటీయూ జిల్లా నాయకుడు మహిపాల్, చంద్రయ్య, స్నేహలత, మణికంఠ, లలిత, సుజాత, రోజ, అనంతమ్మ, భాగ్యలక్ష్మి, చంద్రకళ ఉన్నారు.

ఈవీఎంలపై అవగాహన ఉండాలి


ఈవీఎంల పనితీరును పరిశీలిస్తున్న సీఐ రాములు

కొడంగల్ రూరల్: ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఈవీఎంలపై అవగాహన కలిగి ఉండాలని సీఐ రాములు సూచించారు. శుక్రవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈవీఎంలపై అవగాహన కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈవీఎం, వీవీప్యాట్ల పనితీరును తెలుసుకోవాలని, ఎలా ఓటు వేయాలో, ఓటు వేసిన అనంతరం తమ ఓటు సద్వినియోగం అయిందా లేదా పరిశీలించుకోవాలని సూచించారు. కొన్ని సెకన్లపాటు తాము ఓటు వేసిన గుర్తు స్క్రీన్‌పై వస్తుందని, దానికి గ్రహించాలని చెప్పారు. అవగాహన కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందులో పర్సాపూర్ సర్పంచ్ సయ్యద్ అంజద్, నాయకులు నీలినారాయణ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిరీక్షణకు తెర

- తండాలకు తీరుతున్న 40 ఏళ్ల బీటీరోడ్డు కల
- హర్షం వ్యక్తంచేస్తున్న గిరిజనులు


రోడ్డు నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న గిరిజన నాయకులు, పీఆర్ డీఈఈ

యాలాల: నాలుగు దశాబ్దాల బీటీరోడ్డు నిరీక్షణకు మోక్షం లభించడంతో తండాల ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు. యాలాల మండలం సంగాయగుట్టతండా అనుబంధ తొప్పెర్లగడ్డతండాకు 40 ఏళ్లుగా బీటీరోడ్డు సౌకర్యం లేదు. దీంతో అత్యవసర సమయాల్లో అంబులెన్సులు, ఇతరత్రా రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యేవి. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి చొరవతో ట్రైబల్ సబ్‌ప్లాన్ కింద సంగాయగుట్టతండా బీటీరోడ్డు నిర్మాణానికి రూ.30 లక్షలు, తొప్పెర్లగడ్డతండాకు రూ.90 లక్షలు 2020లో నిధులు మంజూరు అయ్యాయి. ఆయా తండాలకు మంజూరైన బీటీరోడ్డు పనులను శుక్రవారం పంచాయతీరాజ్ డీఈ కరుణాకర్‌చారి, ఏఈ సంతోష్‌కుమార్ సర్పంచ్ లలితాబాయి రెడ్యానాయక్, ఉపసర్పంచ్ కిషన్ నాయక్‌ల సమక్షంలో సుదీర్ఘ కాలం అనంతరం పనులను ప్రారంభించారు. దీంతో ఇన్నేండ్లకు రోడ్డు కల తీరుతుందని గిరిజనులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

ఏఎంసీ డైరెక్టర్లుగా ఐదుగురు

యాలాల: తాండూరు ఏఎంసీ(వ్యవసాయ మార్కెట్ కమిటీ) నూతన పాలకవర్గంలో డైరెక్టర్లుగా యాలాల మండలానికి చెందిన ఐదుగురిని ఖరారు చేసినట్లు తెలిసింది. కొత్త పాలకవర్గంలో యాలాల మండలం దేవనూరుకు చెందిన మంత్రి వెంకటయ్య, తిమ్మాయిపల్లికి చెందిన కృష్ణకుమార్, ముద్దాయిపేట శ్రీనివాస్‌గౌడ్, రేళ్లగడ్డతండాకు చెందిన గోవింద్‌నాయక్, కోకట్‌కు చెందిన ముస్తఫా పేర్లను ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఖరారు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. త్వరలో ఏర్పాటు కాబోయే తాండూరు ఏఎంసీ పాలకవర్గంలో వీరు డైరెక్టర్లుగా బాధ్యతలు చేపట్టనున్నారు.

నేడు 5కే రన్

కొడంగల్ రూరల్: 5కే రన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తహసీల్దార్ విజయకుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన శుక్రవారం తహసీల్ కార్యాలయంలో మాట్లాడారు. శనివారం ఉదయం 6గంటలకు పట్టణంలోని రైతు బజార్ నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ఓటరును చైతన్య పరిచే విధంగా 5కే రన్ జరగనుందని తెలిపారు. ‘నేను ఖచ్చితంగా ఓటు వేస్తాను’ అనే నినాదంతో కొనసాగే కార్యక్రమంలో నియోజకవర్గంలోని అధికారులు, అనధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో పూజలు


భజనలో ధార్మిక సేవా సమితి సభ్యులు

కొడంగల్ రూరల్: పట్టణంలోని ఆధ్యాత్మిక ధార్మిక సేవా సమితీ ఆధ్వర్యంలో గురువారం రాత్రి భక్తిశ్రద్ధలతో చాతుర్మాస పూజలు జరిగాయి. లాహోటీ కాలనీ ఉపాధ్యాయుడు నారాయణ నివాసంలో శ్రీమన్నారాయణ చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. ఆషాఢ శుద్ధ ఏకాదశి నుంచి కార్తీకమాసం చివరి వరకు ప్రతి గురువారం రాత్రి 8గంటల నుంచి 12గంటల వరకు భజన కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం రాత్రి భగవద్గీతా పారాయణం, హనుమాన్ చాలీసా, దైవ ప్రార్థనలతో దేవ దేవుణ్ణి స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక ధార్మిక సేవా సమితీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ హీరాలాల్ మాట్లాడుతూ ఆధ్యాత్మికతను పెంపొందించుకుంటే మనసు ఉల్లాసంగా ఉంటుందన్నారు.

ఈ సారి రెండు పంటలకు సాగునీరు


ప్రాజెక్టు కింద వరిపంటను సాగుచేసిన నాగసమందర్ రైతులు

ధారూరు: కోట్‌పల్లి జలాశయం కుడి, ఎడమ కాల్వలతో పాటు బేబికెనాల్‌కు నీటిని వదలడంతో ఆయకట్టు రైతులు వరి పంటను సాగుచేస్తున్నారు. ఎప్పుడు రబీ పంటలకు మాత్రమే నీటిని వదిలిపెట్టేవారు. ఈ ఏడు కొత్తగా వానాకాలం పంటలకు నీరు విడుదల చేయడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు ఆయకట్టు కింద వరి పంటను సాగుచేస్తున్నారు. పలువురు రైతులు ఇప్పటికే వరినాట్లు వేయగా.. మిగతా వారు నారు పోసి, నాట్లు వేయడానికి సిద్ధమవుతున్నారు. ప్రాజెక్టు ఆయకట్టు 9,200 ఎకరాలు కాగా.. కాల్వలు సరిగ్గా లేక 5 వేల ఎకరాలకే పరిమితమైంది. ఈ సారి వానాకాలం పంటకు నీరు ఇస్తున్నామని, పొదుపుగా వాడుకొని రెండో పంటకు నీరు సరిపోయేలా అన్నదాతలు సహకరించాలని తాండూర్ ఇరిగేషన్ డీఈ భాస్కర్ కోరారు. వాస్తవానికి ఖరీఫ్‌కు నీటిని వదిలిపెట్టొద్దని, ఈ యేడు అధిక వర్షాలతో అలుగు ద్వారా వృథాగా పోతున్న వరదనీటిని వదిలిపెట్టామని వారు పేర్కొన్నారు. రెండు సీజన్ల పంటలకు పొదుపుగా నీటిని వాడుకొని రైతులు లబ్ధిపొందాలని ఆయన సూచించారు.

తహసీల్దార్ గణేశ్‌కు సన్మానం


తహసీల్దార్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మర్పల్లి: నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ గణేశ్‌ను తన కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ స్థానిక నాయకులు శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు తహసీల్దార్‌తో మాట్లాడారు. మీ పరిధికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని కోరారు. సన్మానించిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్, ఉపాధ్యక్షుడు ఎండీ సలీం, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మారెడ్డి, రాష్ట్ర యూత్ కార్యదర్శి నిఖీల్‌రెడ్డి, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కోకన్వీనర్ ఈశ్వర్, బీసీసెల్ మండల అధ్యక్షుడు కుమ్మరి సర్వేశ్వర్, మండల నాయకులు మల్లేశ్ యాదవ్, ప్రభాకర్‌రెడ్డి, మర్పల్లి యూత్ ప్రెసిడెంట్ సాయికుమార్ తదితరులు ఉన్నారు.